# కాక్ టెయిల్





''కాఫీయే టీ - టీయే కాఫీ! కాఫీయేటీ-టీయే కాఫీ'' అరుపులు గట్టిగా వినిపించి నిద్రాభంగమైంది కొండల్రావ్‌కు. కళ్ళు నులుముకుని లేచి కూర్చున్నాడు. అప్పటికే ట్రెయిన్ నెమ్మదిగా కదిలింది. కిటికీ వద్దకు చేరుకుని 'కంపార్ట్‌మెంట్‌లోంచే గావుకేక పెట్టాడు ''బోయ్ - కాఫీ'' అంటూ.

కొండలరావు కేక రైలు కూతలో కలిసిపోయింది. పట్టు వదలకుండా కేక వేయడం, అలా కొండలరావు అరచినప్పుడల్లా రైలు కూత వేయడంతో అతగాడి ప్రయత్నం విఫలమైంది. రైలు వేగం పుంజుకుంది.

కొండల్రావు నిరాశగా కూర్చున్నాడు. వేడి కాఫీ నోట్లో పడందే అతగాడి దిన చర్య మొదలవదు. ''రాబోయే స్టేషన్ ఏమిటా'' - అని ఆలోచిస్తూ వుండిపోయాడు. అతడి ఆలోచనల కనుగుణంగా పట్టాల మీద పరుగెడుతున్న రైలు శబ్దం అతడి కర్ణపుటాలకు ''కాఫీ యేటీ - టీయే కాఫీ - కాఫీ యేటీ - టీయే కాఫీ''.- అంటూ లయబద్ధంగా వినిపించసాగింది. కొండలరావు నరాలు బిగుసుకుపోయాయి. అవి కాఫీ తాగి తీరాలని మొరాయించాయి.

ఆలోచిస్తున్న కొండలరావుకు క్రితంసారి రైలు ప్రయాణంలో జరిగిన మోసం హఠాత్తుగా గుర్తుకొచ్చింది. రాజమండ్రి నుంచి నేరుగా గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో వస్తుండగా కర్ణపుటాలకు ''కాఫీయేటీ - టీయేకాఫీ'' అనే అరుపులు 'త్వమేవాహం - త్వమేవాహం' అన్నట్టుగా వినబడి మహదానంద పడిపోయాడు. టీ త్రాగాలా - లేక కాఫీ త్రాగాలా అనే మీమాంసలో బడి ఎటూ నిర్ణయించుకోలేక ఆర్డర్ తీసుకోవడానికొచ్చిన బోయ్‌తో అప్రయత్నంగా టీ తెమ్మని చెప్పాడు. బోయ్ అదృశ్యమైన కొద్ది సెకన్ల తరువాత కాఫీ ఎందుకు ఆర్డర్ చేయకపోతిని చెప్మా అనుకుంటూ

బోలెడంత బాధపడి పోయాడు.

కొన్ని నిమిషాల తరువాత బోయ్ అందించిన కప్ అందుకుని అందులోని ద్రవ పదార్థాన్ని కొద్దిగా సిప్ చేశాడు. అనుమానం కలిగి మరో గుక్క తాగి తన అనుమానం నిజమేనని రూఢి చేసుకున్నాడు. తాను త్రాగుతున్నది కాఫీ-టీ సమపాళ్ళలో కలిపిన కాక్‌టెయిల్ అని అప్పటికప్పుడు తోటి ప్రయాణీకులతో ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీతో గూడా కన్‌ఫరమ్ చేయించి బోయ్‌ను గదమాయించి నిజం చెప్పమని నిలదీశాడు.

ఆ కుర్రాడు యోగిలా నవ్వాడు అది నిజమేనని - కాఫీ, టీ నీళ్ళను సమ పాళ్ళలో తాము కలుపుతామని, కాఫీ కోరుకున్న వారికి అది కాఫీలా, టీ కోరుకున్న వారికి అది టీలా భ్రమింపజేస్తుందని, ఒక్క సూర్యుండు తానొక్కొక్కడై సమస్త జీవులకు గోచరించినట్లుగా తాను తెచ్చిన మిశ్రమం, తాగే వారి మనోభావాల్ని అనుసరించి కాఫీ లేదా టీలా గోచరిస్తుందనీ చెప్పాడా కుర్రాడు.

"నేనే అబద్ధం చెప్పడం లేద్సార్! కాఫీయే టీ-టీయే కాఫీ అని అరుస్తున్నాను గదా! అంటే దానర్థం కాఫీ ప్లస్ టీ గదా!" కొండల్రావ్ నిస్సహాయంగా మోసానికి గురయ్యాడు. ఈ విషయం కన్‌స్యూమర్స్ కౌన్సిల్‌కు రిపోర్టు చేద్దామన్నంత ఆవేశమొచ్చినా ఆ ప్రయత్నాన్ని తాత్కాలికంగా విరమించుకున్నాడు.

# వి.పి.బి.నాయర్ IPS

## స్పెషల్ ఐ.జి.ఆఫ్.పోలీస్

ఇంతలో కాఫీ కప్ టీ బోయ్ కంపార్టుమెంట్‌లోకి ప్రవేశించాడు. అతణ్ణి జూస్తునే కొండల్రావ్ ముఖం వికసించింది. అమృతం పంచడానికొచ్చిన మోహినిలా ఆ క్షణంలో అతగాడు గోచరించాడు.

కొండల్రావ్‌కు బాగా తెలుసు - తాను మరీ మరీ తెలుసుండీ కాక్‌టెయిల్ ఐ మీన్ కాఫీ కప్ టీని తాగుతున్నానని. జిహ్వా చాపల్యం అతణ్ణి లొంగదీసింది. ధైర్యం చేసి ఓ కప్ పట్టమ్మని బోయ్‌తో చెప్పాడు. బోయ్ అందించిన కప్‌లోని పదార్థాన్ని రుచి చూసిన కొండల్రావ్ ఆముదం తాగిన చంటాడిలా ముఖం పెట్టి తర్వాత గుర్రుమన్నాడు.

కొండల్రావ్ దక్షయజ్ఞం సినిమా సెకండాఫ్‌లోని శివుడిలా తాండవం చేసి, పాతాళ భైరవి సినిమాలో యస్వీ రంగారావులా హుంకరించేడు. కాఫీ కప్ టీ పదార్థం చల్లగా వుందని ర్థంకె లేశాడు.

"మీరు ఐస్ కాఫీ ఆర్డరిచ్చారేమో ఐస్ క్యూబ్ లేయడం మరచిపోయుంటాడు" - ప్రయాణీకుల్లో ఒకరు జోకేశారు. ఆ జోకేశ్వరావ్ మీద గంయ్ మంటూ లేచిన కొండల్రావ్ ఈ చల్లటి పదార్థానికి డబ్బులిచ్చే ప్రసక్తి లేదని స్టేట్ మెంట్ ఇచ్చేశాడు.

బోయ్ వచ్చి కొండల్రావ్‌ను బతిమాలాడు. కానీ కొండలరావు బండలా అయి, బెండ్ అయ్యే సూచనలు కన్పించక ఇదెక్కడి మొండిరా బాబూ అని ఖరాకండిగా తేల్చుకున్న బోయ్ "ప్రక్క స్టేషన్ వచ్చేస్తుంది అక్కడ మీకు వేడి కాఫీ ఇస్తాన్సార్" అంటూ అభయమిచ్చాడు.

"అలా దారికి రా!" అంటూ కొండల్రావ్ విజయగర్వంతో నవ్వుతుండగానే బోయ్ పరుగెత్తుకుంటూ ఆగిన ట్రెయిన్ లోంచి దిగి సరిగ్గా రెండు నిమిషాల తరువాత పొగలు కక్కుతున్న కప్‌తో ప్రత్యక్షమయ్యాడు.

కొండల్రావ్ జేబులోంచి రూపాయి తీసి కుర్రాడి చేతి కందించాడు. కుర్రాడు కంపార్ట్‌మెంట్‌లోంచి వెడుతూ వేదాంతిలా నవ్వాడు. "హా ఎంత జెప్పినా వినలేదు. ఇంతకీ ఇంజన్‌లోంచి కారే నీళ్ళు తాగాలని ఆయనకు రాసుంటే నేనేలా ఆపను"

గబుక్కున దిగిపోయాడా కుర్రాడు. రైలు నెమ్మదిగా కదిలింది. కప్‌లోని పదార్థాన్ని తాగిన కొండలరావుకు కుర్రాడి మాటలు విన్పించి వస్తున్న వాంతిని కంట్రోల్ చేసుకోసాగాడు.



మనసులో గతం తాలూకు కాకటెయిల్ స్టోరీ చేదు నిజంలా ఫ్లాష్ బేక్‌లో కన్పిస్తున్నప్పటికీ కాఫీ త్రాగాలనే కోరికను మాత్రం జయించ లేకపోయాడు కొండలరావ్.